క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఓహెచ్ ట్యాంక్

పాణ్యం: మండలంలో పూర్తయిన అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు పాణ్యంలోని సచివాలయం-2 భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. అదే విధంగా తమ్మరాజుపల్లో రూ.26లక్షలతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంక్, రూ.3లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభచనున్నారు. అలాగే గ్రామంలో రూ.5లక్షలతో వేసిన సీసీ రోడ్డు, రూ. 21.60 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్సీ కమిషన్ చైర్మన్

కోడుమూరు రూరల్: ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మంగళవారం తుగ్గలి మండలంలో పర్యటించిన అనంతరం కర్నూలుకు వెళ్తూ కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌ను కలిశారు. మండలంలోని అమడగుంట్ల గ్రామ సచివాలయంలో ప్రజా సమస్యలపై సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కొద్దిసేపు మాట్లాడి వెళ్లిపోయారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శ్రీధర్

సి.బెళగల్: ప్రజల ఫిర్యాదులపై పోలీసులు సత్వరమే స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోడుమూరు సీఐ శ్రీధర్ సూచించారు. మంగళవారం సీఐ స్థానిక పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. రికార్డులు, పెండింగ్ కేసులు వివరాలపై ఎస్ఐ పీరయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ మధ్యకాలంలో నమోదైన కేసులు, ప్రజల ఫిర్యాదులపై పోలీసులతో సమీక్ష నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ఆపదలో ఉన్నవారికి సాయపడాలని, అప్పుడే పోలీసులకు గుర్తింపు వస్తుందన్నారు. భూ తగాదాలను సివిల్ కోర్టులు, రెవెన్యూ పరిధిలో పరిష్కరించుకునేలా ప్రజలకు సూచించాలన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

సి.బెళగల్: గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు జగనన్న వడ్డించే మధ్యాహ్న భోజనం నాణ్యత ఉండాలని ఎంఈఓ ఆదామ్‌బాషా సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని స్పెషల్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని భుజించి రుచిపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అదేవిధంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 10వ తేదీన విద్యార్థులకు అల్బెండజోల్ మందులను అందజేయాలని ఈ సందర్భంగా ఎంఈఓ ఉపాధ్యాయులకు సూచించారు.

సన్మానం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేసి ఎస్ఏగా పదోన్నతిపై పోలకల్ హైస్కూల్‌కు వెళ్లిన ఉపాధ్యాయురాలు దుర్గెమ్మను మంగళవారం ఘనంగా సన్మానించారు. దుర్గెమ్మను ఎంఈఓ ఆదామ్ బాషాతోపాటు హెచ్ఎం సరోజమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం విరుపాక్షయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు రేవుల శ్రీనివాసులు, కిషోర్‌కుమార్, మునిస్వామి, నాగన్న, సోమశేఖర్, టీచర్లు శ్రీధర్, హరిబాబు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కానుకలు సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కానుకలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రభుత్వం సరఫరా చేసిన జామెట్రీ బాక్స్, పెన్నులు, బుక్స్ రాపర్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. అంతకు ముందు ఉదయం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చిటికెల సామ్యూయేల్, ప్రదీప్ కుమార్ చేతుల మీదుగా స్థానిక బాలుర వసతి గృహ విద్యార్థులకు విద్యా కానుకలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి నిసార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంబదహాల్‌కు ఎమ్మెల్యే రాక

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ బుధవారం రానున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి తెలిపారు. 'మీ సచివాలయం మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని సచివాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలతో సమావేశమవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

పండ్ల తోటలు.. ఆదాయం నిత్యం !

- సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వాల చేయూత
- మండలంలో 223 ఎకరాల్లో మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు
- ఇప్పటికే 180 ఎకరాలలో పూర్తి చేసిన అధికారులు
- జామ, కొబ్బరి, సీతాఫలం మొక్కల పెంపకానికి అన్నదాత ఆసక్తి


ఉయ్యాలవాడలో సీతాఫలం మొక్కలను నాటిన దృశ్యం

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యనిస్తుంది. పెట్టుబడి సాయంతోపాటు దిగుబడులు అమ్ముకునే వరకు ప్రభుత్వం రైతన్నకు అండగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులకు నిత్యం ఆదాయం చేకూరే పండ్ల తోటలు పెంపకానికి చేయూతిస్తుంది. కేంద్రం సహకారంతో రాయితీ కల్పిస్తూ పండ్లతోటల పెంపకానికి ఊతమిస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. రైతన్నకు ఆదాయం చేకూరేలా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం చుట్టింది. మొక్కలు ఉచితంగా అందజేయడంతో పాటు ఉపాధి కూలీలలో నాటిస్తుంది. ప్లాంటేషన్ నాటు ఖర్చు, నీటి సరఫరా, మొక్కలను మూడేళ్ల వరకు పోషణను ప్రభుత్వమే భరిస్తుంది. ఐదేళ్ల మొక్కల పెంపకం చేపడితే పదేళ్ల పాటు నిత్యం ఆదాయం చేకూరుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాలకొలను, ఓర్వకల్లు, కన్నమడకల, ఎన్ కొంతలపాడు, చింతలపల్లె గ్రామాలు మినహా మిగతా గ్రామాలలో పండ్ల తోటల సాగుకు రైతులు ముందుకువచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 5 ఎకరాల భూమితో పాటు, జాబు కార్డు ఉండి ఆసక్తి గల చిన్న, సన్నకారు రైతులను పథకానికి అర్హులుగా పరిగణిస్తారు. అంటే రైతులు కేవలం భూమి కేటాయిస్తే చాలు...మొక్కల కొనుగోలు మొదలు మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులన్ని ప్రభుత్వమే భరిస్తోంది.

223 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు...

ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు ప్రస్తుతానికి మండలంలో 223 ఎకరాలకు మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పకే సుమారు 180 ఎకరాలలో మొక్కలు నాటే కార్యక్రమం పూర్తయినట్లు అధికారుల సమాచారం. రైతులు ఎంపిక చేసుకున్న జామ, కొబ్బరి, సీతాఫలం వంటి రకాలను పశ్చిమ గోదావరి జిల్లా, కడియం నర్సరీ నుంచి తెప్పించగా, చీని మొక్కలను కడప జిల్లా, రైల్వే కోడూరులో ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వర్షాలు కురిస్తే త్వరలో వంద శాతం లక్ష్యాన్ని సాధించేందుకు సిద్ధంగా ఉన్నారు. దిగుబడి వచ్చే వరకు అంతర పంటలు వేసుకోవడానికి అయ్యే ఖర్చులు కూడ ప్రభుత్వమే చెల్లిస్తుండటం ఎంతో లాభదాయకంగా ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు మంచి అవకాశం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుంది. పండ్ల తోటలకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ మాలాంటి చిన్న, సన్నకారు రైతులకు మంచి అవకాశం. మాకున్న మూడు ఎకరాల్లోనూ సీతాఫలం మొక్కలను నాటుకున్నా. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల కొనుగోలు నుంచి వాటి నిర్వహణ ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తోంది. ఇలా మూడేళ్ల వరకు ఖర్చులను చెల్లించడం వలన రైతులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. చాలా సంతోషంగా ఉంది.

– గురుజాల బాలకృష్ణ, సన్నకారు రైతు, ఉయ్యాలవాడ

పండ్ల తోటల సాగుతో లాభాలు



ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం పండ్ల తోటలను సాగుతో మంచి లాభాలు పొందవచ్చు. ఉపాధి హామీ పథకం ద్వారా నేను 1.76 ఎకరాలలో చీని మొక్కలను నాటుకున్నా. ఈ రకం పండ్ల తోటలు ఐదేళ్లలో కోతకు వస్తాయి. అందులో మూడేళ్ల పాటు ప్రభుత్వమే వాటికయ్యే నిర్వహణ ఖర్చులను భరిస్తున్నందున భారం ఉండదు. పండ్ల తోటల మధ్య ఇతర అంతర పంటలను సాగుకు అవకాశం ఉంది. లాభసాటి ఉంటుందనే చీనీ మొక్కలు నాటా.

– బి.తిప్పన్న, చిన్నకారు రైతు

పండ్ల తోటలతో సుస్థిర సంపద



పండ్ల తోటల పెంపకం ద్వారా రైతులకు సుస్థిర సంపద లభిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలతో చిన్న, సన్నకారు రైతులు మంచి లాభాలు పొందే అవకాశం ఉంది. మండలంలో ఈ ఏడాది కొత్తగా 223 ఎకరాలలో పండ్ల తోటలను సాగు చేసుకునేందుకు 21,196 మొక్కలను సరఫరా చేశాం. ఇప్పటి వరకు ఆయా గ్రామాలలో సుమారు 180 ఎకరాలో 18,260 మొక్కలను నాటించాం. త్వరలో వంద శాతం మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కుమార్‌సాయినాథ్, ఏపీఓ, ఓర్వకల్లు

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

19వ వార్డులో..

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని 19వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారని, అర్బన్ పరిధిలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

టీకాలు వేయించుకోవాలి

కల్లూరు: గర్భిణులు, చిన్న పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలను వేయించుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారిణి ప్రమీలా దేవి సూచించారు. మంగళవారం దూపాడు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనస్ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0-5 సంవత్సరాల పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలను వేయించి వివరాలను యూ విన్ యాప్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

గూడూరు: ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీఓ హరిప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ సమావేశమయ్యారు. ఓటరు జాబితా సవరణకు బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని, వారి వెంట రాజకీయ పార్టీల ప్రతినిధులు వెళ్లి సహకరించాలన్నారు. డబల్‌ఎంట్రీ, మృతి చెందిన వ్యక్తుల వివరాలను బీఎల్ఓలకు తెలుపాలన్నారు. ఆగస్టు 21 వరకు ఇంటి సర్వే ఉంటుందన్నారు. ఇప్పటి వరకు 94,503 గృహాలను బీఎల్ఓలు సందర్శించారని, 29 శాతం వెరిఫికేషన్ పూర్తయినట్లు ఆర్డీఓ పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ శివ శంకర్ నాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎల్ వెంకటేశ్వర్లు, సుందరాజు, గజేంద్రగోపాల్ , మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నామినేషన్ల ఘట్టం ప్రారంభం

- 14 న ఉపసంహరణ, 19న పోలింగ్
- తొలి రోజు నామినేషన్లు నిల్

ఓర్వకల్లు: గ్రామ పంచాయితీలలో ఖాళీ ఏర్పడిన వార్డు సభ్యులకు మంగళవారం నుంచి అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. అయితే తొలి రోజున ఒక్క నామినేషన్ దాఖలు కాలేదన్నారు. మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలలో వివిధ కారణాలతో ఏర్పడిన ఖాళీల భర్తికి ప్రభు త్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా నామినేషన్లను ఈ నెల 10 వరకు స్వీకరిస్తామన్నారు. 11వ తేదీన పరిశీలన, 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు తిరస్కరణ వుంటుందన్నారు. 14న మధ్యాహ్నం 3 గంటలకు ఉపసంహరణ, అదేరోజు అభ్యర్థుల తుది జాబితాను విడు దల చేస్తామన్నారు. 19వ తేదీ ఉదయం 7 మధ్యా హ్నం 1గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. కేతవరం-8వ వార్డు, శకునాల-10 వ వార్డు, ఓర్వకల్లు-7వ వార్డు, బ్రాహ్మణపల్లె-7వ వార్డు, చింతలపల్లె-2వ వార్డులకు ఈ నెల 19వ తేదీన ఎన్నికలు జరగనున్నట్లు ఎంపీడీఓ వివరించారు.

వార్డు మెంబర్ల ఎన్నికలకు నామినేషన్లు నిల్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల పరిధిలోని నాలుగు వార్డు మెంబర్ల స్థానాలకు మొదటి రోజు మంగళవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ తెలిపారు. ఆర్‌కే దుద్యాలలో 4వ వార్డు (అన్ రిజర్వుడ్), ఉల్చాలలో 11వ వార్డు (అన్ రిజర్వుడ్), జి శింగవరంలో 2వ వార్డు (అన్ రిజర్వుడ్ ఉమెన్), దిగువపాడులో 8వ వార్డుకు (అన్ రిజర్వుడ్)కు ఎన్నికలు జరగనున్నట్లు వివరించారు. పోటీ చేయాలనుకునే అభ్యర్థులు 10వ తేదీలోపు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు సమర్పించవచ్చన్నారు.

మొదటి రోజు 2 నామినేషన్లు

పాణ్యం: మండలంలో ఖాళీగా ఉన్న రెండు వార్డులకు సంబధించి రెండు నామినేషన్లు వచ్చినట్లు ఈఓఆర్డీ భాస్కర్‌రావు తెలిపారు. కొండజుటూరు ఒక్క నామినేషన్ రాలేదని, కొలురులో చౌడం సంజమ్మ, చౌడం జ్యోతి నామినేషన్లు వేశారన్నారు.

వలంటీర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు


అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండలంలో ఖాళీగా ఉన్న వలంటరీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించా రు. మొత్తం 5పోస్టులు ఖాళీగా ఉండగా 14మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని ఈఓఆర్డి భాస్కర్‌రావు, ఏఓ నరసింహారెడ్డి, ఎంఈఓ కోట య్య తెలిపారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉన్నతాధికారులకు పంపామన్నారు. ఎన్నికైన అభ్యర్థులకు ఫోన్‌చేసి తెలియజేస్తున్నట్లుతెలిపారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హరిబాబు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరి అభివృద్ధికి సహకరించాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హరిబాబు కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల ఆయన మాట్లాడుతూ కళాశాలో బీఏ, బీకాం, బీఎస్సీ కంప్యూటర్ అండ్, బాటనీ కోర్సులు ఉన్నాయన్నారు. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు అందుబాటులో ఉన్న కళాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే కళాశాలో బోధిస్తున్న బోధన పద్ధతులు, సౌకర్యాలను ఆయన వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


అమడగుంట్లలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సూచించారు. 'మీ సచివాలయ...మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అమడగుంట్ల గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సందర్శించారు. ప్రజలతో సమావేశమయ్యారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారమయ్యాయనే అంశాలపై గ్రామ సచివాలయ సిబ్బంది, మండల అధికారులతో చర్చించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. మండల పరిధిలో పరిష్కారమవ్వని సమస్యలను జిల్లా అధికారులకు అప్పటికప్పుడే ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా మండలస్థాయి అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు నేరుగా మేలు జరుగుతుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు అసత్యారోపణలు, విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అర్హులైన ప్రతి పేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలందుతున్నాయని, అర్హులైనప్పటికీ ఏవైనా నిబంధనల మూలంగా పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకొస్తే న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మోదీన్‌బాషా, ఎంపీటీసీ తిరుపతయ్య, పీఎస్ శంకరమ్మ, వీఆర్వో మధు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, ఉసేన్‌నాయుడు, నంద్యాలశ్రీను తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ ప్రభుత్వ ఫలాలు

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


నందనపల్లెలో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందాయని, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు అధికారులు, సర్పంచ్ మాధురి, సొసైటీ చైర్మన్ శేషిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, అనిల్‌బాషా, స్థానిక మహిళలు బంతిపూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నుదుట తిలకందిద్ది హారతిచ్చి స్వాగతించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో వివరించారు. ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. మురుగునీటి కాల్వలు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు మార్చాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. నాపరాయి బండలు పడి రెండు కాళ్లు విరిగిపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.4లక్షలు ఖర్చు చేసి చికిత్స చేయించుకున్నానని, నడవలేని దుస్థితిలో ఉన్నానని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని నాగేషులు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేతో తమ గోడును చెప్పుకున్నారు. అలాగే మూడేళ్ల క్రితం పక్షవాతంతో బాధపడుతున్నానని, రూ.6 లక్షలు ఖర్చు చేసి వైద్య చేయించుకున్నా ఫలితం లేదని ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని ఎమ్మెల్యేను బి మద్దమ్మ, కుటుంబ సభ్యులు వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. మనబడి నాడు నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహెమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, మౌలాలి, ఉప సర్పంచ్‌లు వాసు, మల్లశివుడు, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, మాజీ సర్పంచ్ ఏసేపు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు అబ్దుల్ మసీద్, గోపాల్, బీచుపల్లి, నాగరాజు, కృష్ణ, సురేష్, ఎంపీడీఓ అజాంఖాన్, పీఎస్ భార్గవి, వీఆర్‌ఓ బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నందనపల్లె గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మొదటిరోజు నామినేషన్లు నిల్

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో ఖాళీగా ఉన్న వార్డుమెంబర్-6 (ఎస్సీ-మహిళ), గోరంట్ల గ్రామంలో వార్డుమెంబర్-1 (ఎస్సీ-మహిళ) స్థానాలకు ఎన్నిక నిర్వహించేందుకు మంగళవారం నామినేషన్ల స్వీకరణను చేపట్టినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మొదటి రోజు రెండు స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా రాలేదని ఎంపీడీఓ చెప్పారు.

ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శన

గోరంట్ల గ్రామ పంచాయతీ స్టేజి-1 ఎన్నికల అధికారి పీఆర్ ఏఈ గంగరాజు, ప్యాలకుర్తి గ్రామ పంచాయతీ స్టేజి-1 ఎన్నికల అధికారి ఈఓఆర్డీ మంజుల మంగళవారం ఆయా గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శించి ఎన్నికల నియమావళిని ప్రజలకు వివరించారు.

మిషన్ ఇంద్రధనస్సును జయప్రదం చేయండి

- డీఐఓ డాక్టర్.ప్రవీణ్ కుమార్


ఐరన్ మాత్రలను పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఓర్వకల్లు: ఆరోగ్య, వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనుష్‌ను జయప్రదం చేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 1 వ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఎంత వరకు టీకాలు పూర్తి చేశారు? ఇంకా ఎంత మందికి వేయాలి తదితర వివరాలపై ఆరోగ్య కార్యకర్తలతో ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు, గర్భిణుల లో రక్తహీనతను తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మూడు విడతలుగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 7-12 వరకు మొదటి విడత కార్యక్రమం పూర్తికావస్తోందన్నారు. రెండవ విడతను సెప్టెంబర్ 11వ తేదీ నుంచి 16 వరకు, మూడవ విడతను అక్టోబర్ 9వ తేదీ నుంచి 14 వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. అనంతరం గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్.రాఘవులు, జిల్లా సామాజిక ప్రచారకర్త ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంధి, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి


మృతిచెందిన షేక్ ఖాజా హుసేన్

కోడుమూరు రూరల్ : మండలంలోని లద్దగిరి గ్రామంలో అప్పుల బాధ తాళలేక రెండు రోజుల కిందట పురుగులమందు తాగిన షేక్ ఖాజా హుసేన్ (32) మంగళవారం రాత్రి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షేక్ ఖాజాహుసేన్ కుటుంబ అవసరాలతో పాటు, పొలాల పెట్టుబడులకు సుమారు రూ.5లక్షలకు పైగానే అప్పులు చేశాడు. చివరకు అప్పులు తీర్చే మార్గం తెలియక గత ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితితో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలే మృతిచెందాడు. మృతుడికి భార్య చెస్మాతో పాటు, కుమారుడు, కుమార్తె సంతానం.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

–డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య


ఉలిందకొండ పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రాగిడ్డయ్య

కల్లూరు: ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఆరోగ్య సూత్రాలు వివరించి చైతన్య పరచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. మంగళవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య సేవల కార్యక్రమాల వివరాలన్నింటిని సంబంధిత యాప్‌లలో వందశాతం నమోదు చేయాలన్నారు. ఈ నెల 10వ తేదీన అంతర్జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లోని డేటా అంతా సరిగా ఉన్నాదా?లేదా? అని ఆరా తీశారు. అనంతరం తడకనపల్లె గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ రోగుల ఇంటింటికీ వెళ్లి వారికి అవసరమైన మందులను ఇవ్వాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు.